క్లుప్తంగా

మంచాలమ్మ సేవలో పీఠాధిపతి



మంచాలమ్మకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: గ్రామ దేవత మంచాలమ్మకు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విశేష పూజలు నిర్వహించారు. శుభ మంగళవారం సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య అభిషేకం గావించారు. అనంతరం అమ్మవారికి విశేష వస్త్ర ధారణ చేసి మంగళ హారతులు పట్టారు.

భూ రీసర్వే ప్రారంభం

కౌతాళం: మండలంలోని కామవరం గ్రామంలో మంగళవారం భూ రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. సర్పంచ్ వసంత, వీఆర్‌ఓ నర్సిములు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరసేన రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

త్వరలో మిరప మార్కెట్ ప్రారంభం



మిరప వ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెయార్డు సెక్రటరీ రామ్మోహన్

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో మిరప మార్కెట్ త్వరలో ప్రారంభమవుతుందని యార్డు సెక్రటరీ రామ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మిరప వ్యాపారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మిరపయార్డు ప్రారంభమైతే తీవ్రస్థాయిలో రైతులు మిరప దిగుబడులను యార్డుకు తీసుకొస్తారని, కొనుగోలు చేసుకోవడానికి వ్యాపారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. వ్యాపారులు అధిక సంఖ్యలో ఉంటేనే రైతులు దిగుబడులు తెచ్చే అవకాశం ఉందన్నారు.

సామాజిక అసమానతలు తొలగించండి



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కౌతాళం: సామాజిక అసమానతలను తొలగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కేవీపీఎస్ మండల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో దళితుల పట్ల కొనసాగుతున్న అంటరానితనం, సామాజిక అసమానతలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు చిన్న మారయ్య, నాయకులు తాయప్ప, వీరేష, భాస్కర్, చంద్రప్ప, రాగప్ప, కృష్ణ, పంపన్న, ఈరన్న, చిన్న, ఆదాము పాల్గొన్నారు.

ముమ్మరంగా భవన నిర్మాణాలు



వల్లూరులో స్లాబ్ వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని పలు ప్రభుత్వ భవన నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వల్లూరు గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులను మంగళవారం తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 23 సచివాలయాలకు గానూ 3 సచివాలయాలు పూర్తి అయ్యాయన్నారు. మరో 9 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సెప్టెంబర్ చివరికంతా వీటిని పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. మిగిలిన 11 సచివాలయాలు బేస్‌మట్టం, వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

కందుకూరులో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం పురస్కరించుకుని ఈనెల 25న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న అర్గనైజర్లు ఆనంద్, రామాంజి, శేఖర్, వీరేష్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి ఎమ్మెల్యే రూ.15 వేలు, ద్వితీయ బహుమతి గ్రామ నాయకుడు శివమ్మ గారి తాయన్న రూ.10 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 24వ తేదీలోగా ఎంట్రీ ఫీజు రూ.1,000 చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182708760, 9137947532లకు సంప్రదించాలన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ఓపీ టికెట్

పెద్దాసుపత్రిలో ప్రారంభమైన డిజిటల్ సేవలు

- స్మార్ట్ ఫోన్ ద్వారా ప్రతిరోజు 600 నుంచి 800 వరకు ఓపీ రిజిస్ట్రేషన్
- అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, నర్సులు
- ఆసుపత్రిలో సేవలన్నీ ఆన్‌లైన్ దిశగా అడుగులు
- ఇకపై రోగి మెడికల్ రికార్డులన్నీ ఆన్‌లైన్



ఓపీ టికెట్ ఇస్తున్న కంప్యూటర్ ఆపరేటర్



ఓపీ టికెట్ తీసుకుంటున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు జిల్లా నుంచే కాకుండా నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్‌ఆర్, రాయచోటి, ప్రకాశం జిల్లాల.. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ప్రతిరోజూ 2వేల నుంచి 2,500 వరకు ఓపీ ఉంటోంది. ఇన్‌పేషంట్లుగా 1500 పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. 38 దాకా విభాగాలున్న ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం ప్రతిచోటా చికిత్స కాగితాలపైనే కొనసాగుతోంది. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగి అన్ని విభాగాలకు సంబంధించిన రిపోర్ట్స్, చికిత్సకు సంబంధించిన కాగితాలను సంవత్సరాల తరబడి భద్రపరచుకోవడం కూడా ఇబ్బందిగానే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–హాస్పిటల్ రోగులకు ఎంతో ఉపయోగపడుతుంది.

స్పెషాలిటి ఓపీ విభాగాల్లో ఈ–హాస్పిటల్

ప్రస్తుతం ఆసుపత్రిలోని స్పెషాలిటీ విభాగాలైన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, సైకియాట్రి, డెంటల్, గ్యాస్ట్రో ఎంట్రాలజి, గైనకాలజి విభాగాల్లోని ఓపీ సేవల వద్ద, మైక్రోబయాలజి, పెథాలజి, బయోకెమిస్ట్రీ ల్యాబోరేటరీల్లో ఈ–హాస్పిటల్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఇందుకోసం ఆయా విభాగాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి నెట్ కనెక్షన్ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ఓపీ టికెట్ తీసుకున్న రోగి వివరాలు చెప్పగానే ఓపీలో రోగి వ్యాధి లక్షణాలను ఎంటర్ చేస్తారు. అనంతరం అవసరమైన పరీక్షల కోసం ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదవుతాయి. ఆ మేరకు మళ్లీ సదరు ల్యాబ్ వద్దకు వెళ్లి మొబైల్‌లో అభా నెంబర్ చెబితే చాలు. అక్కడ కంప్యూటర్‌లో రోగి వివరాలు చూసి పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం రిపోర్ట్స్ కూడా ఓపీలో ఉన్న వైద్యునికి ఆన్‌లైన్‌లోనే వెళ్తాయి. అందులోని రిపోర్ట్స్ ఆధారంగా రోగికి వైద్యులు చికిత్సను అందిస్తారు. మందులు సైతం ఆన్‌లైన్‌లో ఫార్మసికి చేరుతాయి. అక్కడ రోగికి ఫార్మాసిస్టు మందులు ఇచ్చి పంపుతారు. రోగి మరోసారి ఎప్పుడైనా ఆసుపత్రికి వచ్చినప్పుడు అభా నెంబర్ చెబితే చాలు అందులోని వివరాల ఆధారంగా మెరుగైన వైద్యం అందించేందుకు ఈ విధానం దోహదపడుతోంది.

- ఆదోనికి చెందిన రామయ్య పెద్దాసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నాడు. వైద్యులు గతంలో చికిత్స చేయించుకున్న చీటీలు తీసుకురావాలని చెప్పారు. అవి ఎక్కడో పోయాయని రామయ్య సమాధానమిచ్చాడు. దీంతో వైద్యులు అతనికి అప్పటి వరకు ఉన్న వైద్య నివేదికల ఆధారంగా మాత్రమే చికిత్స చేసి పంపించారు.
- కౌతాళంకు చెందిన ఉరుకుందప్ప కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షించి కాలేయం సమస్య ఉందని చెప్పారు. తాను గతంలో కూడా వచ్చి చికిత్స చేయించుకున్నానని చెప్పడంతో రిపోర్టులు అడిగారు. అయితే అవి ఇంటి వద్దే ఉన్నాయనడంతో అప్పటి సమాచారం మేరకు చికిత్స చేశారు.
- రోగులకు గతంలో చికిత్స తీసుకున్న వివరాలు తెలియకపోతే వైద్యులు ఆ రోజు పరిస్థితికి అనుగుణంగా మాత్రమే చికిత్స చేస్తారు. అదే పాత రిపోర్టులు ఉంటే గతంలో ఇచ్చిన మందులను మార్చాలా, లేక కొనసాగించాలా? అనే విషయాలను నిర్ధారించుకొని మెరుగైన వైద్యం అందించే వీలుంటుంది. ఈ విషయంలో రోగులకు, వైద్యులకు ఉపయోగకరంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ–హాస్పిటల్ విధానం అమలులోకి తీసుకొచ్చింది.

త్వరలో అన్ని విభాగాల్లో ఈ–హాస్పిటల్



ప్రస్తుతం ఏడు విభాగాల్లో ఈ–హాస్పిటల్ సేవలను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. వారం, పదిరోజుల్లో ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఈ–హాస్పిటల్ సేవలను ప్రారంభించబోతున్నాం. ఓపీ సేవలు పూర్తయ్యాక ఇన్ పేషంట్ సేవలను సైతం ఆన్‌లైన్ చేస్తాం. ఒక్కసారి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైతే భవిష్యత్‌లో దేశంలో ఎక్కడికి వెళ్లినా ఆ వివరాల ఆధారంగానే చికిత్స అందుకునే సౌలభ్యం రాబోతోంది.

– డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ఓపీ రిజిస్ట్రేషన్ ఇలా..



ఓపీ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్

ఆసుపత్రికి వచ్చిన రోగి ముందుగా ఓపీ టికెట్ కౌంటర్ వద్ద ఎక్కువసేపు క్యూలైన్‌లో నిలబడకుండా ప్రత్యేక ఓపీ రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేశారు. ముందుగా రోగి తన స్మార్ట్‌ఫోన్‌లో అభా యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం అందులో తన మొబైల్ నెంబర్‌తో లాగిన్ కావాలి. అప్పుడు అందులో వారి వివరాలతో అభా నెంబర్ క్రియేట్ అవుతుంది. ఇప్పుడు స్కాన్ అండ్ షేర్ విధానంలో రోగి తన మొబైల్ నుంచి కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు. వెంటనే వివరాలన్నీ ఓపీ టికెట్ కౌంటర్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద కంప్యూటర్‌లో ప్రత్యక్షమవుతాయి. ఆపరేటర్‌కు మొబైల్‌లో వచ్చిన ఓపీ టోకెన్ నెంబర్, ఏ విభాగానికి వెళ్లాలనే విషయం చెబితే చాలు వెంటనే ఓపీ టికెట్ ఇచ్చేస్తారు. దీనివల్ల ఓపీ రిజిస్ట్రేషన్‌కు సమయం ఆదా అవడంతో పాటు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ విధానంలో ప్రతిరోజూ 600 నుంచి 800 వరకు ఓపీ టికెట్లు ఇచ్చి చికిత్స చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి చేయండి

● ఎంపీపీ దానమ్మ



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి. చిత్రంలో ఎంపీపీ దానమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని రూరల్: సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీపీ దానమ్మ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. తమ గ్రామంలో యూపీ స్కూల్ లేనందున 5వ తరగతి తరువాత ఉన్నత చదువుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లలేక విద్యార్థులు అనంతరం చదువు మానేస్తున్నారని పాండవగల్ సర్పంచ్ ఉమాదేవి సభ దృష్టికి తీసుకురాగా మూడు కిలోమీటర్ల పరిధిలోనే మరో యూపీ స్కూల్ ఉందని అలాంటప్పుడు గ్రామంలో యూపీ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించదని ఎంఈఓ శ్రీరాములు సమాధానం ఇచ్చారు. 30 పడకల ఆస్పత్రి అయినప్పటికీ డాక్టర్లు, సిబ్బంది సరిగా లేరంటూ కాన్పుల కోసం గర్భిణులు ఆదోనికి రెఫర్ చేయడం ఎంత వరకు సబబు అని పెద్దహరివాణం సర్పంచ్ రాముడు డాక్టర్ ఇమ్రాన్‌ను ప్రశ్నించారు. డాక్టర్లు, సిబ్బంది కొరత నిజమేనని, త్వరలో నూతన ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించి, డాక్టర్లు, పరికరాల ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డాక్టర్ వివరించారు. వ్యక్తిగతంగా కట్టుకున్న ఇళ్లకు హౌసింగ్ బిల్లులు మంజూరు కావడంలేదని దొడ్డనగేరి, చాగి గ్రామల సర్పంచులు శంకరమ్మ, రాజశేఖర్‌గౌడ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అనుమతులు లేకుండా కట్టుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు కావని, అయితే మరోసారి పరిశీలించి నిజమైన అర్హులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హౌసింగ్ డీఈ రవికుమార్ హామీ ఇచ్చారు. రద్దయిన జగనన్న కాలనీల వివరాలను ప్రెస్‌నోట్ ద్వారా ప్రజలకు తెలియజేయాలని నెట్టేకల్ సర్పంచ్ రామాంజనేయులు సభను కోరారు. కరెంట్ కోతల వల్ల మోటార్లు కాలిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, నిరంతర సరఫరా అయ్యేలా చూడాలని పెద్దహరివాణం సర్పంచ్ రాముడు, మదిరె సర్పంచ్ నారాయణ కోరారు. ఇప్పటివరకు తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేదని చాగి గ్రామ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, తమ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ లేరని పాండవగల్ సర్పంచ్ ఉమాదేవి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరచరితులకు పోలీస్ కౌన్సెలింగ్

కర్నూలు: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దందాలు, రౌడీయిజం, అల్లర్లకు పాల్పడే వారి జాబితాను స్టేషన్ల వారీగా సిద్ధం చేసి కర్నూలు శివారులోని జగన్నాథ గట్టుపై ఉన్న పోలీసు శిక్షణా కేంద్రంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గతంలో నేర చరిత్ర ఉన్నవారిని దాదాపు వంద మందికి పైగా డీటీసీకి రప్పించి తీవ్ర స్థాయిలో హెచ్చరించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. నేర చరిత్రకు స్వస్తి చెప్పి గౌరవప్రదమైన జీవితం గడపాలని హెచ్చరించినట్లు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధానంగా ట్రబుల్ మాంగర్స్ కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

కొనసాగుతున్న మినీ సబ్ స్టేషన్ పనులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని జగనన్న కాలనీ సమీపంలో రూ.2.50 కోట్లతో 33/11 కెవి మినీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జగనన్న కాలనీలో 9327 ప్లాట్స్ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించారు. మొదటి విడతలో 5,101 ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. కాలనీలో నివసించే పేద, మధ్యతరగతి వారు భవిష్యత్తులో ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం మినీ సబ్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంది. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే కాలనీతో పాటు చుట్టూ ఉన్న ధణాపురం, నాగనాథనహళ్లి, సాదపురం, మండిగిరి, 104 బసాపురం, కల్లుబావి గ్రామాలకు విద్యుత్తు సమస్య పరిష్కారమవుతుంది. ఈనెలాఖరిలోపు పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఏఈ క్రిష్ణమోహన్ తెలిపారు.

23 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డు సచివాలయ సిబ్బంది 23 మందికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం పట్టణంలోని క్రాంతి నగర్, హరిజన వాడ 1, 2 సచివాలయాలతో పాటు గిప్సన్‌కాలనీ, కిబులా క్వాటర్స్ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాజరు పట్టికలను పరిశీలించగా.. సిబ్బంది గైర్హాజరు తదితర అంశాలను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే మొదట షోకాజ్ నోటీసులు జారీతో పాటు కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పేదలకు వైద్య విద్యను అందుబాటులోకి తెండి

ఆదోని సెంట్రల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ కోరారు. మంగళవారం పీడీఎస్‌ఓ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు గొడ్డలిపెట్టులాంటి 107, 108 జీఓలను రద్దు చేయాలన్నారు. ప్రతి నిరుపేద విద్యార్థులకు కళాశాలలో సీటు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌ఓ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, శివ, రామాంజనేయులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది డిబార్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు, బీఈడీ పరీక్షల్లో ఒకరు డిబారైనట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 6,063 మందికి గానూ 5,402 మంది విద్యార్థులు హాజరయ్యారని, మిగతా 661 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే బీఈడీ పరీక్షలకు 2,212 మందికి గానూ 2,084 మంది విద్యార్థులు హాజరవ్వగా 128 మంది గైర్హాజరయ్యారని వివరించారు. శ్రీ శంకరాస్ డిగ్రీ కాలేజీ (కర్నూలు)–3, ఆర్‌సీ రెడ్డి డిగ్రీ కాలేజీ (కర్నూలు)–2, సాయి డిగ్రీ కళాశాల (ఆదోని), కీర్తన డిగ్రీ కళాశాల (నంద్యాల)లో ఒక్కొక్కరు, బీఈడీ పరీక్షల్లో ఎస్ఎంఎల్ డిగ్రీ కాలేజీ (ఎమ్మిగనూరు)లో ఒకరు చొప్పున విద్యార్థులు డిబారైనట్లు పేర్కొన్నారు. అలాగే సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బీపీఈడీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వీసీ తెలిపారు.

ఘనంగా కలశాల ఊరేగింపు

మంత్రాలయం రూరల్: చెట్నేహళ్లి గ్రామంలో వెలసిన ఈశ్వర స్వామి ఆలయంపై కలశ స్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామంలో కలశాలు, బసవన్న విగ్రహాన్ని గ్రామస్తు లు ఘనంగా ఊరేగించారు. పురవీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి చేర్చారు. ఇటీవల ఈశ్వర స్వామి ఆలయానికి నూతనంగా గోపురాన్ని నిర్మించారు. వాటిపై కలశ స్థాపన చేయనున్నారు. దీంతో ఆలయాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో సుందరీకరించారు. ఆలయంలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేద్దాం

కోసిగి: మేజర్ పంచాయతీ అభివృద్ధికి వార్డు మెంబర్ల సహకారంతో కృషి చేస్తామని సర్పంచ్ కుమారి అయ్యమ్మ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్డు మెంబర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వార్డులలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టి తీసుకురావాలన్నారు. తాగునీటి, పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో మొసలి కలకలం

ఆదోని టౌన్: బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో మొసలి కలకలం రేపుతోంది. నెలరోజుల నుంచి చెరువులో మొసలి ఉన్నట్లు స్థానికులు, వాటర్ వర్క్స్ సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెరువులో మొసలిని చూసి ఫారెస్టు అధికారులకు మంగళవారం లేఖ రాశారు. చెరువు చుట్టుపక్కల రైతులు, గొర్రెల కాపర్లు నీటి కోసం వెళ్తుంటారని, వారిపై మొసలి దాడి చేసే ప్రమాదముందని, వెంటనే బంధించి వేరే ప్రాంతానికి తరలించాలని లేఖలో కోరారు.

సెప్టెంబర్ 8 వరకు సీపీఐ ప్రచార జాతా



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: సీపీఐ ప్రచార జాతా, బస్సు యాత్ర సెప్టెంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ కె.అజయ్‌బాబు, మండల, పట్టణ కార్యదర్శులు కల్లుబావి రాజు, సుదర్శన్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను పార్టీ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో కర్నూలు, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ తాలూకాల్లో ఈ బస్సు యాత్ర సాగుతుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, వైటీ భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

కోసిగి: జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ ఆధ్వర్యంలో మండల మండల అధ్యక్షులుగా రాజేష్, గౌరవ అధ్యక్షులు మోజేష్, ఉపాధ్యక్షులు పందికోన పరశురామ్, కోసిగి ఇన్‌చార్జ్ గుమ్మల మణిలను ఎన్నుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

● ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ధ్యేయమన్నారు. మూడో రోజు మంగళవారం 42వ వార్డు హనుమాన్‌నగర్, మాసామసీదు ఏరియాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కల్వర్టులు, పైపులైన్ నిర్మాణం, వీధి లైట్లు, మురుగు కాలువల మస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు విన్నవించగా వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, వార్డు కౌన్సిలర్లు లోకేశ్వరి, సురేష్, ఫయాజ్, వైస్ చైర్మన్ గౌస్ పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం వాయిదా

ఆదోని పట్టణంలోని 9వ వార్డులో బుధవారం జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సోమ, మంగళవారాల్లో 41, 42 వార్డుల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎండవేడిమికి కాళ్లకు బొబ్బలు ఏర్పడ్డాయి. దీంతో రెండు రోజుల పాటు కార్యక్రమాన్ని వాయిదా వేసి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న తన మాతృమూర్తిని చూసేందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ కోసం రైతుల ఆందోళన

మంత్రాలయం రూరల్: త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వకుండా అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నందవరం మండలం నదికైరవాడి, ఇబ్రహీంపురం, కొట్టాలకు చెందిన రైతులు మంత్రాలయం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. కార్యాలయాన్ని ముట్టడించి అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించారు. వాహనాల రాకపోకలను నిలిపేశారు. టీబీ డ్యాం నుంచి నదికి నీరు వస్తే వాటిని పొలాలకు తడుపుకునేందుకు వీలు లేకుండా విద్యుత్ కోతలను విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. త్రీ ఫేస్ ఇవ్వకుండా విద్యుత్ అంతరాయం కలిగిస్తున్నారని దీంతో వరి పంటలు ఎండుతున్నాయని ఆందోళన చెందారు. ఇందుకు కారణమైన ఏఈ, డీఈలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు అక్కడికి చేరుకొని రైతులకు సర్దిచెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా సాగుకు అవసరమైన సమయానికి విద్యుత్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

విధులు సక్రమంగా నిర్వహించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: సక్రమంగా విధుల నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బరాజు సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని హాల్వి గ్రామ సచివాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి అబ్దుల్ కరీం, వలంటీర్లతో సమావేశమయ్యారు. విధుల పట్ల అంకిత భావంతో ఉండాలని సూచించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను ఎలా చేస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అన్నారు. అనంతరం ఆయన మరళీ గ్రామ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహించండి

కృష్ణగిరి: నీటి సదుపాయం ఉన్న రైతులు పండ్ల తోటల సాగు చేసేలా ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన కృష్ణగిరి సమీపంలో ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన పండ్ల మొక్కలను, హంద్రీనీవా కాలువ వెంట నాటిన అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈఏడాది పండ్ల తోటల సాగును లక్ష్యానికి మించి సాగు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కృష్ణగిరిలో ఇప్పటి వరకు 200 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఆయా గ్రామాల సిబ్బందిపై ఉంటుందన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, టీఏలు శేషిరెడ్డి, ఉశేన్, చెన్నకేశవులు, ఫీల్డ్ అసిస్టెంట్ సుభాష్ ఉన్నారు.

గ్రామ సేవకుడి మృతి

గోనెగండ్ల : మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన తలారి కేశన్న (41) అనే గ్రామ సేవకుడు మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన గ్రామ సేవకుడిగా దాదాపు 20 సంవత్సరాలు సేవలందించాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్, వీఆర్వోలు, వీఆర్‌ఏ సంఘం నాయకులు ఎర్రబాడు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రెవెన్యూ సిబ్బంది రూ.25 వేలు, వీఆర్‌ఏ సంఘం తరుపున రూ.2 వేలు మృతుడి భార్య మహాలక్ష్మికి అందజేశారు.